ఏఈఈ ఫలితాల్లో పారిశుధ్య కార్మికుడి కుమారుడికి 794వ ర్యాంకు

బుంగ నాగరాజు

మోత్కూరు, ఆగస్టు 4 : ఇటీవల విడుదలైన ఏఈఈ ఫలితాల్లో మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపకు చెందిన పారిశుధ్య కార్మికుడి కుమారుడు బుంగ నాగరాజు రాష్ట్ర స్థాయిలో 794వ ర్యాంకు సాధించాడు. పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో ఉద్యోగం పొందాడు. గ్రామానికి చెందిన బుంగ సోమయ్య, ప్రమీల దంపతులది నిరుపేద కుటుంబం. సోమయ్య గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. తల్లి వ్యవసాయ కూలిగా పని చేస్తూ జీవనం గడుపుతున్నారు. నాగరాజు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. పాటిమట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన నాగరాజు.. సూర్యాపేటలో ఇంటర్మీడియట్, హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ చదివి టీజీపీఎస్‌సీ నిర్వహించిన ఏఈఈ పోటీ పరీక్షలకు హాజరయ్యాడు.

నూతన చట్టాలపై అవగాహన

ఆలేరు బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటశ్రీను

ఆలేరు రూరల్, ఆగస్టు 4 : స్థానిక బస్టాండ్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటశ్రీను మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కొత్త చట్టాలపై అవగాహన పెంచుకొని చట్టానికి లోబడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నర్సింహ, సైదులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

భువనగిరి అర్బన్, ఆగస్టు 4 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. భువనగిరిలో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులకు ఇస్తామన్న రూ.12వేలు వెంటనే ఇవ్వాలన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజన వంట కార్మికులకు నెలకు రూ.10వేలు ఇవ్వాలని, కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి శ్రమదోపిడి అరికట్టాలని కోరారు. అంగన్‌వాడీలకు నెలకు రూ.18వేల వేతనం అవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు బోర్డు ఏర్పాటు చేసి కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. గ్రామ పంచాయతీ కార్మికులు, 2వ ఏఎన్ఎంల వేతనాలు పెంచాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రక్షాళన చేసి నిజమైన లబ్ధిదారులకు కార్డులు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్, సహాయ కార్యదర్శులు గానబోయిన వెంకటేశ్, సోమన సబిత పాల్గొన్నారు.

నిషేధిత గుట్కాల పట్టివేత

గుట్కాలు అమ్ముతూ పట్టిబడిన పాన్‌షాపు యజమాని గులామ్ సైదాని

వలిగొండ, ఆగస్టు 4 : నిషేధిత గుట్కాలను అమ్ముతున్న సైదాని పాన్‌షాపుపై భువనగిరి ఎస్ఓటీ పోలీసులు ఆదివారం దాడి చేశారు. సుమారు రూ.30వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని గులామ్ సైదాని తన పాన్‌షాపులో అక్రమంగా నిషేధిత గుట్కాలను అమ్ముతున్నాడనే సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి వివిధ కంపెనీలకు చెందిన గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని గులామ్ సైదానిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

కార్యదర్శులకు సన్మానం

గ్రామ పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

రామన్నపేట, ఆగస్టు 4 : మండలంలోని నీర్నెముల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎదగాని ఉపేందర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మిరియాల లక్ష్మి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. వారిని ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో శ్రమదానం చేసి మొక్కలు నాటారు.

కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగుల సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శి నోముల యాదగిరి, ఉపాధ్యక్షుడు చల్ల ఆనంద్, నోముల నర్సింహ, నాగటి స్వామి, నోముల అశోక్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

నగదు అందజేస్తున్న సన్‌రైస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

బీబీనగర్, ఆగస్టు 4 : మండలంలోని మక్తానంతారం గ్రామానికి చెందిన చెట్టేపల్లి ఆదిత్య, మాధురి తల్లిదండ్రులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారు తమ అమ్మమ్మ, తాతయ్య ఇంట్లో ఉంటున్నారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో సన్ రైస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు ఆల్వా వీరారెడ్డి ఆధ్వర్యంలో పిల్లల చదువుల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు సుందర్‌రావు, సభ్యులు శ్రీకాంత్, దేవేందర్, ఐలయ్య, బాబు, లింగస్వామి పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం

యాదగిరిగుట్ట ఆలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, ఆగస్టు 4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో నిత్య సుదర్శన నారసింహ హోమం వైభవంగా సాగింది. ఆదివారం ఉదయం ప్రధానాలయంలోని కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ నారసింహ హవనం జరిపారు. భూతపేత పిశాచాల బాధలు తొలగిపోయి, ఇలలోక సుఖాలు, పరలోక మోక్షాలు సిద్ధిస్తాయని విశ్వసించిన భక్తులు హోమంలో పాల్గొని పూజలు జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణతంతును నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ చేపట్టారు. స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయం ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చనలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.27,09,469 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త. బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 7న స్వామివారి హుండీలను లెక్కించనున్నట్లు ఈఓ తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వెంకటరెడ్డి తదితరులు

బీబీనగర్, ఆగస్టు 4 : మండల కేంద్రంలోని లెప్రసీ కాలనీలో బేతెస్డ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో 40 నిరుపేద కుటుంబాలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ప్లాప్ (సొసైటీ ఫర్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్) రాష్ట్ర అధ్యక్షుడు మనియాద రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, నల్లా కనెక్షన్ లేక, కాలనీ పక్కన డంపింగ్ యార్డు వల్ల దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీబీనగర్ లెప్రసీ సొసైటీ అధ్యక్షురాలు ఎల్లమ్మ కాలనీ సమస్యలను తెలుపగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని డీసీఎంఎస్ చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లెప్రసీ సొసైటీ ఉపాధ్యక్షుడు మొరిగాడి నర్సింహ, సహ కార్యదర్శి వీరముష్టి ఆంజనేయులు, పెంటయ్య, ఎండీ అజీజ్, సోమయ్య, లింగమల్లు, ఉపేందర్, పాస్టర్లు లాజర్, ఏర్పుల క్రిష్టఫర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రమాదానికి గురైన వాహనాలు

చౌటుప్పల్, ఆగస్టు 4 : మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ పరిధి లింగోజిగూడెం గ్రామం వద్ద గల వంశీ రబ్బర్ పరిశ్రమ సమీపంలో 65వ జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన మహేంద్ర కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఖమ్మం జిల్లా వైరా పట్టణానికి చెందిన పడిమాల వీరభద్రరావు(55) అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న మరొకరు గాయపడ్డారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు

ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

చౌటుప్పల్, ఆగస్టు 4 : పట్టణంలోని విశాల భారత్ హైస్కూల్‌లో షీకో కాయ్ కరాటే ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం షీకో కాయ్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన 25మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అనుముల శ్రీనివాస్, ఆంజనేయులు, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

లారీ క్లీనర్ అదృశ్యం

వలిగొండ, ఆగస్టు 4 : మండలంలోని నాగారం గ్రామం వద్ద లారీ దిగిన క్లీనర్ కనిపించకుండా పోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం శ్రీచల్మా గ్రామానికి చెందిన ఎస్‌కే జాకీర్ లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన జూలై 30న మధ్యాహ్నం 2 గంటల సమయంలో స్క్రాప్ లోడుతో చౌటుప్పల్ నుంచి వలిగొండ మీదుగా భువనగిరి వెళ్తుండగా.. మార్గమధ్యలో వలిగొండ మండలం నాగారం గ్రామ రైల్వే గేటు సమీపంలో లారీ దిగాడు. ఎంతసేపటికీ లారీ వద్దకు రాకపోవడంతో డ్రైవర్ ఎండీ జాఫర్ కిందికి దిగి చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. డ్రైవర్ వెంటనే జాకీర్ బంధువులకు సమాచారం ఇచ్చాడు. జూలై 31న జాకీర్ బంధువులు వచ్చి నాగారం రైల్వే గేట్ సమీపంలోని పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో ఆదివారం వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా నవీన్‌కుమార్

నవీన్‌కుమార్

రాజాపేట, ఆగస్టు 4 : ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా పారుపల్లి గ్రామానికి చెందిన మోత్కుపల్లి నవీన్‌కుమార్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ నియామక పత్రాన్ని అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు నవీన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎర్రగుంట ప్రభాకర్, కిషన్ పాల్గొన్నారు.

'మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి'

భువనగిరి అర్బన్, ఆగస్టు 4 : మున్సిపాలిటీలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు మాయ కృష్ణ అన్నారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ఏ ఒక్క ఎమ్మెల్యే మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, రవి, రామచందర్, యాదమ్మ, కొండల్, కుమార్, యాదగిరి, శాంతమ్మ, వరమ్మ, శ్యామల, భాగ్యమ్మ, రవి, జంగయ్య పాల్గొన్నారు.

వంశరాజుల సంఘం అధ్యక్షుడిగా శేఖర్

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 4 : మున్సిపాలిటీలోని ముక్తాపూర్ చింతబావిలో వంశ రాజుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒంటెద్దు శేఖర్, ఉపాధ్యక్షుడిగా ఒంటెద్దు యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా ఒంటెద్దు జంగులు, కార్యదర్శిగా ఒంటెద్దు బాలరాజు, కోశాధికారిగా ఒంటెద్దు రమేశ్, సభ్యులుగా ఒంటెద్దు శివ, భాను, ధనంజి, శ్రీధర్, సతీశ్, విజయ్ పాల్గొన్నారు.

ముక్తాపూర్‌లో పోచంపల్లి ఆలయ కమిటీ ఎన్నిక

మండలంలోని మక్తాపూర్ గ్రామంలో పోచమ్మ తల్లి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారు నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఒంటెద్దు యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా ఒంటెద్దు జంగారెడ్డి, కార్యదర్శిగా ఒంటెద్దు సత్యనారాయణ , కోశాధికారిగా బండారు వినోద్‌రెడ్డి, సభ్యులుగా బానోతు వంశీ, బండారు కరుణాకర్ రెడ్డి, ఒంటెద్దు భాను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు బండారు ప్రకాశ్‌రెడ్డి, బండారు అనంతరెడ్డి, జంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, నర్సిరెడ్డి, సత్యనారాయణ, నర్సింహ, ఎల్లయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

రామన్నపేట : ఉపాధ్యాయులతో విద్యార్థులు

రాజాపేట, ఆగస్టు 4 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చదువుకునే రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తు చేసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

లింగారెడ్డిగూడెంలో..

చౌటుప్పల్ రూరల్ : పట్టణానికి చెందిన 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం లింగారెడ్డిగూడెం గ్రామంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, రంగారావు, ప్రసాదరావు, విఠల్, ధనుంజయ, ఊశయ్యను విద్యార్థులు సన్మానించారు.

రామన్నపేటలో..

రామన్నపేట : మండల కేంద్రంలోని విజ్ఞాన వర్ధిని హైస్కూల్ 2007-08 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక అమృతవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీ సురేశ్, కె.యాదగిరి, పోతరాజు శంకరయ్య, బేతోజు సత్యనారాయణ శాస్త్రి, రఫీక్, రామచంద్రారెడ్డి, భిక్షమయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

యాదగిరిగుట్ట, ఆగస్టు 4 : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. యాదగిరిగుట్టలోని తన నివాసంలో ఆలేరు మండలానికి చెందిన 52 మంది, ఆలేరు పట్టణానికి చెందిన 33 మంది, ఆత్మకూరు(ఎం)కు చెందిన 51 మంది, మోటకొండూర్‌కు చెందిన 49 మంది, గుండాల మండలానికి చెందిన 63 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఈరసరపు యాదగిరిగౌడ్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

ఆత్మకూరు(ఎం) డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద మురుగు నీటిలో పెరిగిన గడ్డిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 4 : మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, సంబంధిత అధికారులను కోరారు. ఆదివారం డబుల్ బెడ్రూమ్ ఇండ్లను సందర్శించారు. ఇండ్ల మధ్య రోడ్లకు అడ్డంగా పెరిగిన గడ్డిని, బురదమయంగా మారిన రోడ్లను పరిశీలించారు. అక్కడున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి భిక్షం, నాయకులు లింగయ్య, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, స్వామి, మహేందర్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ : బీఆర్ఎస్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆశయ్య

ఆలేరు రూరల్, ఆగస్టు 4 : అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇచ్చిన హామీలను విస్మరించిందని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తమ్మలి ఆశయ్య అన్నారు. మండలంలోని తూర్పుగూడెంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీని ఒకేసారి చేపడుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. విడుతల వారీగా చేస్తూ సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సోషల్ మీడియా మండల కో కన్వీనర్ బండి రాజుగౌడ్, నాయకులు పాండరి, లింగయ్య, శంకరయ్య, బాలయ్య, కృష్ణమూర్తి, రాంచందర్, వెంకటేశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


చంద్రగిరిస్వామి కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోటకొండూర్, ఆగస్టు 4 : మండల కేంద్రానికి చెందిన చంద్రగిరిస్వామికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.57వేల చెక్కును కాంగ్రెస్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ భాస్కరుని రఘునాథ రాజు ఆదివారం అందజేశారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదేశాల మేరకు లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి చెక్కు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమండ్ల అశోక్, మహేశ్, రామకృష్ణ, సిద్ధులు, శ్రీనివాస్, రాములు, మధు, ఉమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

భూదాన్ పోచంపల్లి : ఫ్రెండ్‌షిప్ డే కార్యక్రమంలో పాల్గొన్న యోగా సభ్యులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 4 : పట్టణంలోని బోధి ధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా సభ్యులంతా చేతులు పట్టుకుని స్నేహభావాన్ని చాటారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ప్రపంచంలో నిస్వార్థంగా ఉండేది, ఎలాంటి బంధం లేకున్నా జీవితాంతం మనతో ఉండేది స్నేహం మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకురాలు కొయ్యడ సంధ్యా కాశీనాథ్, డాక్టర్ సీత భాస్కర్, సంస్థ ఉపాధ్యక్షులు చింతల రామకృష్ణ, విడం రామనాథం, ప్రధాన కార్యదర్శి చింతకింది కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

వాసవి పరపతి సంఘం ఆధ్వర్యంలో..

ఆలేరు రూరల్ : స్నేహితుల దినోత్సవం సందర్భంగా వాసవి పరపతి సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఐడియా శ్రీనివాస్, కస్తూరి వెంకటేశ్, సముద్రాల రవి, శ్రీను, నాగేందర్, సంతోష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో 1988 - 89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. కార్యక్రమంలో అనంతరెడ్డి, జహంగీర్, గోపాల్‌రెడ్డి, మతిన్, నగేశ్, భాస్కర్, యాదగిరి, నర్సింహ, మల్లేశం పాల్గొన్నారు.